క్లుప్తంగా

గురుకులంలో తనిఖీ



మడికొండ: మడికొండ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట సామగ్రి, ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డైనింగ్ హాల్ ఎదుట వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీపీఎం శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట వద్ద సీపీఎం వరంగల్ జిల్లా కార్యాలయంలో రామన్నపేట, కరీమాబాద్ ప్రాంతాల పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతుల ప్రిన్సిపాల్‌గా పార్టీ ఏరియా కార్యదర్శి సింగారపు బాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై సీనియర్ నాయకుడు టి.ఉప్పలయ్య బోధించారు. అనంతరం గద్దం రమేష్ ప్రసంగించారు. అభివృద్ధి అంతా శ్రమ మూలంగానే జరిగిందని వివరించారు. కార్యక్రమంలో అరూరి కుమార్, గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, రెడ్డి, చీర కవిత, దివ్య, ఆలం, సింగారపు కృష్ణ, దుర్గయ్య పాల్గొన్నారు.

ఘనంగా గోపూజలు



హన్మకొండ కల్చరల్: కృష్ణాష్టమి పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గోపూజలు శనివారం జరిగాయి. హనుమకొండ బాలసముద్రం కూరగాయల మార్కెట్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో గోపూజలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి, టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ కనపర్తి రఘువీర్, ఎస్వీబీసీ వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ పొట్లపల్లి శ్రీనివాసరావు, కమిటీ బాధ్యుడు రఘునాథ్ పాల్గొన్నారు.

ఎర్రగట్టు గుట్టలో..



హసన్‌పర్తి: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణలోని గోశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని గోశాలలో గోపూజ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పురవర్ధన్, జోన్ చైర్మన్లు నాగమళ్ల సుధీర్, వెలగందుల భీష్మనాథం, గౌరిశెట్టి కృష్ణమూర్తి, శ్యాంసుందర్, రమేష్, భానుప్రకాష్, సత్యప్రకాష్, నిరోషా, రేణుక, లక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బాలుర అప్పగింత



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం -2పై ఉన్న ఇద్దరు బాలురను జీఆర్పీ పోలీసులు హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ సంస్థ ప్రతినిధి సుష్మకు అప్పగించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం నెక్కొండకు చెందిన శివునతూరి రూదాస్, సుభాస్ రూదాస్ తండ్రి వెస్ట్ బెంగాల్‌కు ఇటీవల వెళ్లగా, వారు కూడా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ బాలురను సంరక్షణ కేంద్రానికి శనివారం అప్పగించారు. కార్యక్రమంలో జీఆర్పీ కానిస్టేబుల్ నాగరాజు, విక్రమ్ పాల్గొన్నారు.

భగవద్గీత చేరువ చేసేందుకు..



హన్మకొండ: భగవద్గీతకు మరింత చేరువయ్యే సందర్భమే శ్రీకృష్ణ జన్మాష్టమి అని త్రైత సిద్ధాంతం, ఇందు జ్ఞాన వేదిక జమ్మికుంట శాఖ వ్యవస్థాపకుడు వెంకటాచార్యులు అన్నారు. హనుమకొండ వెంకటేశ్వర కాలనీలో త్రైత సిద్ధాంతం, ఇందు జ్ఞాన వేదిక జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడి గీత బోధన ప్రజలందరికీ తెలియజేయడమే తమ ధ్యేయమన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శశికాంత్, వెంకట్, రాధిక, రాజు, భార్గవి, కవిత, దివ్య, రాజలింగం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణాష్టమి వేడుకలను నగర వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఉట్టికొట్టి సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో కివీ పాఠశాల చిన్నారులు



కాజీపేట విష్ణుపురి ప్రధాన రోడ్డుపై ఉట్టి కొడుతున్న స్థానికులు



గణేష్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న కాలనీవాసులు



కృష్ణుడి వేషధారణలో బాలుడు



రాధ వేషధారణలో చిన్నారి శాన్విక



శ్రీకృష్ణుడి వేషధారణలో..



హసన్‌పర్తి: కృష్ణుడి వేషధారణలో చిన్నారి



కాజీపేటలో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



న్యూశాయంపేటలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మామిండ్ల రాజు



బాలసముద్రంలోని శ్రీనివాస గురుకుల్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

గొప్ప దార్శనికుడు కృష్ణస్వామి ముదిరాజ్

- మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



నివాళి అర్పిస్తున్న బండా ప్రకాశ్, ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: హైదరాబాద్ నగర తొలి మేయర్, స్వాతంత్ర్య సమరయోధుడు కేవీ.కృష్ణస్వామి ముదిరాజ్ గొప్ప దార్శనికుడని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ కొనియాడారు. కృష్ణస్వామి 132వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని తన నివాసంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ కృష్ణస్వామి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో పాల్గొని తర్వాత హైదరాబాద్ తొలి మేయర్‌గా ఎన్నికయ్యారని అన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గంతోపాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వరంగల్ జిల్లా ప్రమోటర్ చొప్పరి సోమయ్య, కలకొండ అభినాష్, గిన్న రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'భద్రకాళి'కి బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు, సునీత

హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వయా భద్రకాళి దేవస్థానం మీదుగా కాజీపేట రైల్వేస్టేషన్ వరకు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ మేరకు భద్రకాళి ఆలయ ఆవరణలో టీఎస్ఆర్టీసీ కొత్త బస్సును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బత్తిని శ్రీనివాస్‌రావు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ బండారు సుబ్రహ్మణ్యం, దేవాలయ ఈఓ రామల సునీత, అర్చకుడు భద్రకాళి శేషు, పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వై ఆకారం బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి



గుంతల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

రామన్నపేట: వరంగల్‌లోని వై ఆకారం బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 10 ఏళ్లు అయిందని, ఈ క్రమంలో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి తెలిపారు. బ్రిడ్జికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జిని నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిపై వీధిలైట్లు లేకపోవడంతో పాటు గుంతలతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నాణ్యతలేని ఐరన్, ఇతర సామగ్రిని వంతెన నిర్మాణానికి వాడడంతో ఈ పరిస్థితి దాపరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎగ్గని మల్లికార్జున్, నగర కమిటీ సభ్యులు రామస్వామి, శివ, హమాలీ సంఘం నాయకులు ఆడప యాదగిరి, భిక్షపతి రాజ్‌కుమార్, గట్టయ్య, గుమాస్తా సంఘం నాయకుడు రాజేందర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి వస్తే పొత్తుకు సిద్ధం



హసన్‌పర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో తమతో కలిసి వచ్చే పార్టీలతో పొత్తుకు సిద్ధమని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ హసన్‌పర్తి మండల ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. అందుకు ఇతర పార్టీలు కలిసి వస్తే పొత్తు పెట్టుకుంటామని చెప్పారు. అన్ని వర్గాలకు బీజేపీ అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మండల కమిటీ సభ్యుడు పుల్లా అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు, జిల్లా కమిటీ సభ్యురాలు రజిత, మండల కమిటీ సభ్యులు సుచేందర్, సుమన్, సతీష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి పోరాటాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖిలా వరంగల్: వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రజా పోరాటాలే శరణ్యమని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నగర కార్యదర్శి మాలోతు సాగర్, ఏరియా కార్యదర్శి సుంచు జగదీశ్వర్, సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ అన్నారు. ఈ మేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద పార్టీ జిల్లా కార్యాలయంలో నల్లెల రాజేందర్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నగర కార్యదర్శి మాలోతు సాగర్ నేతృత్వంలో పలువురు పార్టీలో చేరగా వారిని పెద్దారపు రమేష్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాయినేని ఐలయ్య, నలివేల రవి, ఇట్టినేని మధు, కొమ్ము లావణ్య, యగ్గేని మల్లికార్జున్, ఐతం నాగేష్, బాబు, రామస్వామి, నరహరి, బంగారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హన్మకొండ: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ప్రొఫెసర్ ప్రశాంతి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఇంటర్ విద్య అత్యంత కీలకమని చెప్పారు. సువిద్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులతో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెడికల్, ఐఐటీ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జితేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేరిణి నాట్య పోటీలు



పేరిణి నాట్య పోటీల్లో పాల్గొన్న కళాకారులు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వరంగల్ నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పేరిణి నాట్యంలో శిక్షణ పొందుతున్న వివిధ జిల్లాలకు చెందిన కళాకారులకు శనివారం పోటీలు నిర్వహించారు. వరంగల్‌లోని నృత్యజ్యోతి అకాడమీలో ప్రథమ, ద్వితీయ స్థాయిలలో ప్రాయోగికం, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. చీఫ్ ఎగ్జామినర్‌గా అకాడమీ నిర్వాహకుడు గజ్జెల రంజిత్ కుమార్, మౌఖిక పరీక్షలకు ఎక్స్‌టర్నల్‌గా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పేరిణి నాట్య అధ్యాపకురాలు చాత రాజు నవ్యజ, ప్రాయోగిక పరీక్షకు ఇంటర్నల్‌గా పేరిణి నాట్య గురువు గిర్నే సంతోష్‌కుమార్ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ వరంగల్‌లోని నాగార్జున హైస్కూల్‌లో ఆదివారం ఉదయం వివిధ స్థాయిలలో పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు.

శ్రీకృష్ణుడి శోభాయాత్ర ప్రారంభం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఉపేంద్రశర్మ

ఖిలా వరంగల్: వరంగల్ స్టేషన్ రోడ్డులోని గోవిందాద్రి కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సతీసమేతమైన గోవిందరాజ స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రత్యేక పీఠంపై ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలతో ఆలయ ప్రధాన పూజారి వరయోగులు శ్రీనివాస స్వామి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా నగరంలో శ్రీకృష్ణుడి శోభాయాత్ర శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ హాజరై పాలకవర్గం అధ్యక్షుడు మరుపల్లి సంజీవరావు, యాట సత్యనారాయణ, గుల్లపెల్లి రామకృష్ణ, గూడ శారద, దొడు నాగరాజుతో కలిసి పంచ కల్యాణి రథంపై ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్ర గోవిందాద్రి కొండ నుంచి హెడ్ పోస్టాఫీసు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్, స్టేట్ బ్యాంకు లేన్, గిర్మాజీపేట, అనుమాండ్ల గుడి, గుండ్రోల్ల వీధి మీదుగా గోవిందాద్రి కొండ వద్దకు రథయాత్ర సాగనున్నది. కార్యక్రమంలో అర్చకులు రత్నాకర శాస్త్రి, రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, గోవింద రాజుల ప్రధాన అర్చకులు లక్ష్మణస్వామి, మణికంఠ (టింకు), తాడూరి గోపి, వరయోగుల ప్రసాద్, శ్రీకాంత్, జగన్నాథం వేణు, కూర్మాచలం గోవిందు స్వామి, భక్తులు ఓడపల్లి శ్యామ్‌కృష్ణ, డీజే లడ్డు, నర్ర శశిధర్, నర్రా శశికాంత్, వనం శశి, కందాల యాదగిరి, చెన్నూరి నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా జరపాలి



మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

హన్మకొండ: సేవాలాల్ జయంతిని అధికారికంగా జరపాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో జరుగుతున్న తీజ్ వేడుకల్లో బండారు దత్తాత్రేయ శనివారం పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించాలని సూచించారు. హర్యానాలో అక్కడి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. తీజ్ పండుగ ప్రకృతితో కూడుకున్నదని, ఆడబిడ్డ ఆదిలక్ష్మితో సమానమన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఎదగనివ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న శివకుమార్

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్ సమీపంలో వ్యాపారులు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ హెచ్చరించారు. బస్టాండ్ సర్కిల్‌లో ఉండే ప్రైవేట్ డ్రైవర్లు, యజమానులతో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. బస్టాండ్ సర్కిల్‌లో హైదరాబాద్‌కు వెళ్లే దారిలో ప్రైవేట్ వాహన డ్రైవర్లు రోడ్డుపై వాహనాలను అడ్డదిడ్డంగా ఉంచి ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ముఖ్యంగా ప్రయాణికులను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించుకోవద్దని సూచించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, అసాంఘిక కలాపాలకు పాల్పడిన వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీదేవి, సిబ్బంది

హసన్‌పర్తి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. హసన్‌పర్తి కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు సఖి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. బాధితులకు ఉచిత కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు వివరించారు. సఖి సెంటర్ 24 గంటల పాటు పనిచేస్తోందన్నారు. ఏదైనా సమస్య ఉన్నట్లయితే 181 నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా సఖి సేవల వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖి కేస్‌వర్కర్ అనూష, మహిళలు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: ఈ నెల 24న హనుమకొండ అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర ఆదివాసీ హక్కులు, కార్పొరేటీకరణ, కగార్ హత్యాకాండ, కాల్పుల విరమణ అనే అంశాలపై జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లను పడమర కోటలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత జేవీ చలపతిరావు, ప్రొఫెసర్ హరగోపాల్, నరసింహారెడ్డి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ, విజయ్, ఐలయ్య, హరిబాబు, ఇనుముల కృష్ణ, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస బోనాల వేడుకలు



మడికొండ: బోనాలతో బయలుదేరిన ప్రజలు

మడికొండ: శ్రావణమాసం సందర్భంగా పెద్దమ్మతల్లి బోనాలను మడికొండలో శనివారం నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు, రజకులు ఉదయం పెద్దమ్మ తల్లికి చీరలు, పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించారు. సాయంత్రం బోనాలతో ఉరేగింపుగా తరలివెళ్లి మొక్కులు సమర్పించారు. ఆదివారం మేకపోతులను బలి ఇవ్వనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వినయ్ భాస్కర్

నేడు వడ్డెపల్లిలో పోచమ్మ బోనాలు

హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లిలో ఆదివారం బోనాల పండుగను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. వడ్డెపల్లిలోని పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లను శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా బోనాల పండుగను వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.



బాపూజీనగర్‌లో పోచమ్మతల్లి ఆలయం

పోచమ్మతల్లి ఆలయం ముస్తాబు

కాజీపేట రూరల్: వేడుకలకు కాజీపేట బాపూజీనగర్‌లోని పోచమ్మతల్లి దేవాలయం ముస్తాబైంది. ప్రతి సంవత్సరంలానే ఈ సారి కూడా పోచమ్మతల్లి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలోని పోచమ్మతల్లి విగ్రహాన్ని అలంకరించి, ఆలయానికి రంగులు వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు.

'ఎలైట్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి



హన్మకొండ: హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులోని ఎలైట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం జరుపుకున్నారు. ముందుగా స్కూల్ చైర్మన్ మాడుగుల రాజిరెడ్డి, కరస్పాండెంట్ హరితరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో విద్యార్థులు సందడి చేశారు. ఉట్టి కొట్టే సన్నివేశం కనువిందు చేసింది.